క్లుప్తంగా

ఫిట్‌జీ ఆధ్వర్యంలో బిగ్ బ్యాంగ్ ఎడ్జ్ టెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: ప్రాచుర్యం పొందిన పోటీ పరీక్షల కోసం విద్యార్థులను సిద్ధం చేసేందుకు ఈనెల 22, 29వ తేదీలలో ప్రముఖ విద్యాసంస్థ ఫిట్‌జీ (ఎఫ్ఐఐటీజెఈఈ) బిగ్ బ్యాంగ్ ఎడ్జ్ టెస్ట్‌ను నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని హైదరాబాద్ సెంటర్స్ మెంటార్-డైరెక్టర్ ఆనందరామన్ తెలిపారు. ప్రస్తుతం 5 నుంచి 11వ తరగతి వరకూ చదివే విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. అదనపు వివరాల కోసం www.igbangedge.com లో ఉన్నాయని తెలియజేశారు.

నేడు ప్రైమరీ స్కూల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌లో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే ప్రైమరీ స్కూల్ నిర్మాణ పనులకు శుక్రవారం మధ్యాహ్నం 12.30గంటలకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్ కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు, వార్డు, ఏరియా కమిటీ మెంబర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

బాలానగర్: రాజుకాలనీ మసీదు వీధిలో ఇటీవల చేపట్టిన వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేశామని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ శిరీష బాబురావు

మూసాపేట: కేపీహెచ్‌బీకాలనీ భువన విజయం గ్రౌండ్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను అందజేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశించారు. ఈ మేరకు గురువారం కార్పొరేటర్లు పగుడాల శిరీషబాబురావు, సబిహాబేగం క్రీడాకారులకు కిట్లను డీసీ రమేష్, హెల్త్ ఆఫీసర్ డా. సోలమన్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులకు అవసరమైన పరికరాలను అందించడంతో వారిలో ప్రతిభను మెరుగుపర్చుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రావు, నాగేశ్వరరావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ వద్ద బీజేపీ నాయకులు సాయినాథ్‌రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలో మంత్రి కేటీఆర్ సభను అడ్డుకుంటామేమోనని భయపడి ఎమ్మెల్యే అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఇలాంటి అక్రమ అరెస్టులు ఎన్ని చేసినా భయపడేది లేదన్నారు. రానున్న రోజుల్లో బీఆర్‌యస్ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. మేడ్చల్ బీజేపీ జిల్లా మీడియా కోఆర్డినేటర్ ప్రీతం రెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పట్లోళ్ల సాయినాథ్ రెడ్డి, అధ్యక్షులు గంధం రాజు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేశభక్తుల సుధా, బీజేపీ వన్ ఫన్ ఫైవ్ డివిజన్ సెక్రటరి లక్ష్మీ, బీజేపీ సీనియర్ నాయకులు రవి మహేందర్ తదితరులను కేపీహెచ్‌బీ పోలీస్‌లు అరెస్టు అయ్యారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. 'హెల్తీ అండ్ హ్యాపీ ఫ్యామిలీస్'(బాండింగ్ త్రూ ఫిజికల్ లిటరసీ) అనే అంశంపై దేశంలోని పలు ఫిజికల్ లిటరసీ పాలసీలో ఫిజికల్ లిటరసీ అడ్వకేట్ డాక్టర్ అమిత్ మాలిక్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.



ప్రగతి నివేదన సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



భారీగా హాజరైన మహిళలు

ప్రగతి జోష్

ప్రగతి నివేదన సభకు తరలిన గులాబీ శ్రేణులు

కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 45రోజుల పాదయాత్ర ముగిసిన నేపథ్యంలో గురువారం ప్రగతి నివేదన సభను ఘనంగా నిర్వహించారు. కేపీహెచ్‌బీ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కార్పొరేటర్లు భారీ ర్యాలీగా వెళ్లి మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలికారు. ప్రధాన రహదారులు గులాబీమయం అయ్యాయి.

– కూకట్‌పల్లి జోన్ బృందం









మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్తున్న కార్పొరేటర్లు సబిహా బేగం. ముద్దం నర్సింహయాదవ్

టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

- గ్రూప్-1 పేపర్ రద్దుపై ఏబీవీపీ నిరసన
- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కూకట్‌పల్లి: టీఎస్పీఎస్సీ గ్రూప్-1 పేపర్ రద్దుకు కారణమైన రాష్ట్ర ప్రభుత్వం, చైర్మన్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఏబీవీపీ కూకట్‌పల్లి జిల్లా ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జిల్లా కన్వీనర్ ప్రతీక్ మాట్లాడుతూ... సాధించుకున్న రాష్ట్రంలో దశాబ్ద కాలంగా నిరుద్యోగులను గాలికొదిలేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల శాపంగా మారిందని విమర్శించారు. పటిష్టమైన నిర్ణయాలు తీసుకోకుండా యువతను నిరుత్సాహ పరుస్తోందన్నారు. టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఆకాష్, నగర సంయుక్త కార్యదర్శులు ఆయుష్, రాఘవేంద్ర, నగర ఉపాధ్యక్షులు భరత్, మోక్ష, కార్యకర్తలు సంజయ్, వంశీ, జయప్రకాష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

బీజేపీ జెండా చూస్తే బీఆర్ఎస్‌కు వణుకు

కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తూ అధికారిక కార్యక్రమాలకు కేంద్రం ఆహ్వానిస్తున్నా తెలంగాణ ముఖ్యమంత్రి హాజరు కాకపోవటం ఆయన చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు.. కేసీఆర్ పాలన వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు గురువారం ఫతేనగర్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ... ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. బీజేపీ జెండా చూస్తే బీఆర్ఎస్ పార్టీకి భయమెందుకని ప్రశ్నించారు. పాదయాత్రలో ప్రజల నుంచి అందుతున్న వినతి పత్రాలను చూస్తుంటే కూకట్‌పల్లి అభివృద్ధి ప్రదాత అని చెప్పుకునే కృష్ణారావు పనితనానికి నిదర్శమని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కూకట్‌పల్లి నియోజకవర్గంలో నేడు పాదయాత్రలో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా అన్ని డివిజన్‌లలో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, మూసాపేట కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్, కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయకులు ప్రేమకుమార్, సురేందర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న బీజేపీ నేతలు మాధవరం కాంతారావు, పన్నాల హరీష్‌రెడ్డి

బాల బతుకమ్మ- రాజన్న ఫేమ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరించిన గొట్టిముక్కల పాండు రంగారావు, సంస్థ నిర్వాహకురాలు అరుణ

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి బాలల మీద తీస్తున్న పాట 'బాల బతుకమ్మ – రాజన్న ఫేమ్' అనే పోస్టర్‌ను శ్రీసాయి అలేఖ్య సంఘ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు అరుణఅశోక్ గురువారం గొట్టిముక్కల పాండురంగారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సంస్థ నుంచి ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నందుకు అభినందనలు తెలుపుతున్నానన్నారు. సంస్థకి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న విధంగా బాలలను పోత్సహించడం మంచి విషయమన్నారు.

కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీహిల్స్ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.7లక్షలతో 64 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. గురువారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై సీఐ వెంకటేష్, ఎస్సై మౌనిక, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి సీసీకెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో నేరాలు అరికట్టడంలో సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడుతాయని అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



హెచ్ఎంటీహిల్స్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అల్పాహారం అందజేత

మోతీనగర్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బంజారాహిల్స్ శాఖ అధ్యక్షుడు కేల వెంకటరావు పేర్కొన్నారు. గురువారం ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద లయన్ పురుషోత్తం సహకారంతో అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ... నగరంలోని ప్రముఖ ఆస్పత్రుల వద్ద రోగులు, వారి సహాయకులకు అల్పాహారం, మధ్యానం భోజనం అందిస్తున్నామన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైతం అల్పాహారం అందజేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు

15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని శ్రీచిత్తారమ్మ దేవస్థానంలో 15వ తేదీ ఆదివారం నుంచి 24వ తేదీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మాజీ చైర్మన్ నాయినేని శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు అమ్మవారు చిత్తారమ్మ అలంకారంలో దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటలకు విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవాచనము, మంటపారాధన, కలశ స్థాపన, కుంకుమార్చనలు, మహాహారతి, చండీహోమం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదం వితరణ వంటి కార్యక్రమాలతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ కుర్మయ్య గారి నవీన్‌కుమార్, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవి రంగారావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

16 నుంచి 'విద్యలో ఏఐ'పై శిక్షణ

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్దూ మీడియం టీచర్స్ (సీపీడీయూఎంటీ) ఆధ్వర్యంలో 'విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సీపీడీయూఎంటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ సమీ సిద్దిఖీ పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అయిదు రోజుల పాటు ఆన్‌లైన్‌లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లోని ఖురాన్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే శిక్షణలో పాల్గొనేవారు ఉచితంగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని, పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందించబడునన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.99484 12484, 83739 84391.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ పరిధిలోని ధరణినగర్, జయశంకర్ కాలనీలో రూ.20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అదే విధంగా రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెట్టి కాలనీని సుందరంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాథ్ యాదవ్, శివరాజ్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, వి. రాజబాబు, సుధాకర్‌రెడ్డి, పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

కాలనీ, బస్తీల సమస్యల పరిష్కారానికి కృషి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రావు

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు 'మార్పు కోసం బీజేపీ'అనే నినాదంతో ప్రజా సమస్యలపై నిర్వహించే పాదయాత్ర డివిజన్ అధ్యక్షులు మాణిక్‌రావు అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన బీజేపీ నాయకులతో న్యూ కాలనీ, కాలపురం బస్తీలలో పర్యటించి అక్కడ ఉన్న సమస్యలు స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో బస్తీలో సగం ఇళ్లు మునిగిపోతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

◆ అదే విధంగా డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని, డ్రైనేజీ నీరు పొంగి పొర్లి రోడ్డుపై పారుతుండటంతో దోమలకు ఆవాసంగా మారిందని తెలిపారు. దీంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయని సమస్యను పరిష్కరించాలన్నారు. దీంతో ఆయన స్పందిస్తూ సమస్యలన్నీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదన్నారు.

◆ బీఆర్ఎస్ పాలకులకు కాలనీ వాసులు ఎన్నిసార్లు వాళ్ల బాధలు చెప్పుకున్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి గెలిచిన తరువాత సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల లక్ష్మణ్, విజయేంద్ర సింగ్, ప్రభాకర్, సిద్ధు, మన్యం, భాష, శివ, పాపయ్య, శ్యామ్, మహేష్, గోవింద్, బాలు, వెంకట్, సంతోష్, రవి నాయక్, ప్రశాంత్, రత్నం తదితరులు పాల్గొన్నారు.



న్యూ కాలనీ, కాలపురం బస్తీలలో పర్యటిస్తూ కరపత్రాలను అందజేస్తున్న సురభి రవీందర్‌రావు, నేతలు

ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానం





సాయినారాయణపురి కాలనీలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్. పాల్గొన్న పోలీసు అధికారులు

బేగంపేట ఏసీపీ రమాలింగరాజు

ఓల్డ్ బోయిన్‌పల్లి: సమాజంలో జరుగుతున్న నేరాలను అదుపు చేసేందుకు బస్తీ, కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని బేగంపేట ఏసీపీ రామలింగరాజు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. సాయినారాయణ పురి కాలనీలో అసోసియేషన్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి కృషి ఫలితంగా సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గాయన్నారు. లండన్ కంటే మన నగరంలోనే సీసీ కెమెరాలు అధికంగా ఉన్నాయని తెలిపారు.

నేను నేత్రాన్ని.. మరో నేత్రాన్ని

ఈ సందర్భంగా ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఏసీపీ శంకర్‌రాజు సీసీ కెమెరాలపై రాసిన కవితను చదివి వినిపించారు. 'నేను నేత్రాన్ని మరో నేత్రాన్ని... నేను కాలన్ని మహాకాలన్ని.. అదర భూతాన్ని, నాలో వైరుధ్యాలు, వైశ్యామ్యాలు లేవు... నీ. నా మంచి చెడుల ప్రవాహంలో నాలో తన మన అనే భావన లేదు... వాస్తవికత, అవాస్తవిక అంతా నిజమే.. సాంకేతిక సవాళ్లను ఎదిరిస్తాను..'ఈ కవిత అందరిని ఎంతగానో ఆకట్టుకుంది.

ఏర్పాటుకు ముందుకొస్తే సహకారం అందిస్తాం...

కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మాట్లాడుతూ... కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటులో 70 శాతం నిధులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారం అందించారన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చిన వారికి తమ వంతుగా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, బేగంపేట ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఏసీపీ శంకర్‌రాజు, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య, కాలనీ ప్రతినిధులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, నర్సింహా, జీఎస్ రమేష్, సుదర్శన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.